ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 6
సంపుటి : 3
సంచిక : 145
సోమవారం 25 నవంబర్ 2024 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## ఐపీఎల్ తొలిరోజు వేలం
### రూ.27 కోట్లతో పంత్ రికార్డు
### లీగ్ చరిత్రలోనే అత్యధిక రేటు



5 లో..



## చివరి దశకు సమగ్ర
# కుటుంబ సర్వే
## డేటా ఎంట్రీ కీలకం

- దోర్‌లాక్, వలస వెళ్లిన వారి వివరాలు సేకరించండి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం
- జార్ఖండ్ నుంచి కుటుంబ సర్వేపై వీసీ
- త్వరలో మధ్యాహ్న భోజనంపై సమీక్షిస్తామని వెల్లడి

**హైదరాబాద్, రోమింగ్ న్యూస్,:** సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని, ఇందులో డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమైనదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లుకు పలు సూచనలు చేశారు. డేటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమైనది, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తేయీ కాబట్టి వారికి ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను క్రమబద్ధకరించుకోవాలని,

మిగతా 2 లో

## నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

కేంద్ర మంత్రి అధ్యక్షతన అఖిలపక్షం సమావేశం

02

## వికసిత్‌భారత్‌లో
# యువతే కీలకం
## నేనూ ఎన్సీసీ క్యాడెట్‌ను!


### ఆ అనుభవం నాకెంతో అమూల్యం

**మన్‌కీ బాత్‌లో కాలేజీ రోజులను గుర్తుచేసుకున్న ప్రధాని**
**అందరూ ఎన్‌సీసీలో చేరాలని సూచన**

> మహారాష్ట్రలో విజయం సాధించిన తర్వాత ప్రధాని మోడీ ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ ద్వారా ప్రజలతో మమేకమయ్యారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సీసీ) డే సందర్భంగా ఆయన తన పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. దేశంలోని యువత కూడా ఎన్‌సీసీలో చేరాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు జనవరి 12న వివేకానంద జయంతి సందర్భంగా భారత్ మండపంలో యువజన ఆలోచనల మహాకుంభం ఉంటుందని ప్రధాని తెలిపారు. దీనికి 'డెవలప్డ్ ఇండియా యంగ్ లీడర్స్ డైలాగ్' అని పేరు పెట్టినట్లు పేర్కొన్నారు. గయానా విదేశీ పర్యటనను కూడా మోడీ ప్రస్తావించారు.

**ఢిల్లీ, రోమింగ్ న్యూస్ :** "ఈ రోజు ఎన్‌సీసీ దినోత్సవం. ఇది ఎంతో ప్రత్యేకమైన రోజు. ఎన్‌సీసీ పేరు వినగానే మనందరికీ మన కాలేజీ, అలనాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తుంటాయి. నేను కూడా ఎన్‌సీసీ క్యాడెట్‌నే. ఆ సమయంలో నేను పొందిన అనుభవం నాకెంతో అమూల్యమైంది. పూర్తి విశ్వాసంతో ఈ మాట మీకు చెబుతున్నాను. యువతలో క్రమశిక్షణ, సేవా గుణాన్ని, నాయకత్వ లక్షణాలను మరింత పెంపొందించడంలో దీని పాత్ర కీలకం" అని ప్రధాని వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీ తన మన్ కీ బాత్ కార్యక్రమంలో.. "దేశంలోని అనేక ప్రాంతాల్లో యువత వ్యర్థపదార్థాల నుంచి అద్భుతాలు తయారు

మిగతా 2 లో





02

### నేడు ఢిల్లీకి సీఎం

- కాంగ్రెస్‌అధిష్ఠానంతో రేవంత్ సమావేశం
- ప్రజాపాలన విజయోత్సవాలపై చర్చించే అవకాశం
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రాహుల్‌గాంధీకి ఆహ్వానం



02

### ఇల్లందు మాజీ ఎమ్మెల్యే కన్నుమూత

- మూడుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన ఊకే అబ్బయ్య
- అనారోగ్యంతో హైదరాబాద్ లోని ఓ దవాఖానలో తుదిశ్వాస
- సీఎం సహా పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం

### రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

- కొనుగోలు చేసిన ధాన్యం వెనక్కి పంపడంతో మనస్తాపం
- సూర్యాపేట జిల్లా అన్నారం ఐకేపీ కేంద్రం వద్ద ఉద్రిక్తత



02

# కాంగ్రెస్, బీజేపీ మెడలు వంచుదాం

### ప్రజలను కాపాడుకునేందుకు మరో సంకల్ప దీక్ష అవసరం

- రేవంత్‌పాలనలో మళ్లీ నాటి నిర్బంధాలు
- 29న ఘనంగా రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్
- జిల్లాలకు ఇన్‌చార్జిల నియామకం
- దీక్షా దివస్‌లో కేసీఆర్ పాల్గొడం లేదు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ హాట్ కామెంట్స్

**హైదరాబాద్, రోమింగ్ న్యూస్ :** తెలంగాణలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాపా డుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకోసం మరో సంకల్ప దీక్ష కూడా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని పేర్కొ న్నారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజ లు కాంగ్రెస్ పాలనలో అణచివేత, భయాం దోళనకు గురవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో ఉమ్మడి రాష్ట్రం నాటి నిర్బంధాలు

మిగతా 2 లో






### లగచర్ల ఘటనలో కీలక పరిణామం

- దాడి ఘటన నిందితులతో ఎన్ హెచ్ఆర్సీ భేటీ
- సంగారెడ్డి జైలుకు జైల్లో రైతులను కలిసిన సభ్యులు
- ఘటనపై పూర్తిగా ఆరా తీసిన బృందం

**సంగారెడ్డి, రోమింగ్ న్యూస్ :** వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలువురు రైతుల్ని అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం వారు సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీరిని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఎన్ హెచ్ఆర్సీ బృందం ఆదివారం కలిసింది.

# విశ్వశాంతి కోసం మోదీ ప్రయత్నం

- అభివృద్ధిని కొన్ని శక్తులు సంహించడంలేదు
- అరాచకాలు సృష్టించేందుకు చూస్తున్నారు
- విశ్వగురువు కోసం అందరూ కలిసి పని చేయాలి
- లోక్‌మంథన్ ముగింపు వేడుకల్లో కిషన్ రెడ్డి

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ శిల్పకళా వేదికలో ఆదివారం లోక్‌మంథన్-2024 కార్యక్రమం ముగింపు వేడుకలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగిన లోక్ మంథన్‌లో వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షేకావత్, ఆర్ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరయ్యారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
25 నవంబర్
2024





## చివరి దశకు సమగ్ర కుటుంబ సర్వే

(మొదటిపేజీ తరువాయి)

వారిని అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధరీకరించుకోవాలి అని తెలిపారు.

**త్వరలో మధ్యాహ్న భోజనంపై సమీక్ష**

కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి. ఈ పాఠశాలలో ఆహారం, పరిశుభ్రతపై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సాధించిందని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ రకమైన సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం, జిహెచ్ఎంసి కమిషనర్, కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఇల్లందు మాజీ ఎమ్మెల్యే కన్నుమూత

- మూడుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన ఊకే అబ్బయ్య
- అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో తుదిశ్వాస
- సీఎం సహా పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం



**భద్రాద్రి కొత్తగూడం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గిరిజన నాయకుడు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య (70) తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అబ్బయ్య ఉమ్మడి ఏపీలో బూర్గంపాడు నుంచి ఓసారి, ఇల్లందు ఎమ్మెల్యేగా రెండుసార్లు పనిచేశారు. ఊకే అబ్బయ్య సీపీఐ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చా రు. తొలిసారిగా 1985లో బూర్గంపాడు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం 1999లో ఇల్లందు నియోజకవర్గం నుండి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2009లో తెలుగుదేశం పార్టీ తరపున ఇల్లందు నుంచే పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఆయనకు టికెట్ నిరాకరించింది. దీంతో ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. ఆ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా ఇల్లందు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినా కాంగ్రెస్ టికెట్ నిరాకరించటంతో ఇల్లందు నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆయన కొంత కాలంగా యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటున్నారు. అనంతరం అనారోగ్యం బారిన పడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఆయన మృతిపై పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు.

**సీఎం రేవంత్ సహా.. పలువురు నేతలు సంతాపం తెలిపారు.**

గిరిజన నాయకులు, శాసనసభ మాజీ సభ్యులు ఊకే అబ్బయ్య గారి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. అబ్బయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఊకే అబ్బయ్య ఉమ్మడి రాష్ట్రంలో బూర్గంపహాడ్ నియోజకవర్గం నుంచి ఒకసారి, ఇల్లందు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు అమూల్యమైన సేవలందించారని సీఎం గుర్తుచేశారు.

## సినీనటుడు అలీకి నోటీసులు

**ఫామ్ హౌస్ లో అక్రమ నిర్మాణాల ఆరోపణలు**



**వికారాబాద్, నవంబర్24:** సినీ నటుడు, కమెడియన్ అలీకి లీగల్ నోటీసులు పంపారు అధికారులు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం ఎక్‌మామిడి గ్రామ పంచాయతీ అలీకి నోటీసులు ఇచ్చింది. పంచాయతీ అనుమతి లేకుం డా ఫామ్‌హౌస్‌లో నిర్మాణాలు చేపట్టారని నోటీసుల్లో పేర్కొంది. ఎక్ మామిడి గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభా రాణి... ఈ మేరకు సినీనటుడు అలీకి నోటీసులు జారీ చేశారు. ఫామ్‌హౌస్‌లోని నిర్మాణాలను వెంటనే ఆపివేయా లని ఆదేశించారు. ఎక్‌మామిడి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 345లోని ఫామ్‌హౌస్‌లో నూతన నిర్మాణాల కు సంబంధించి తగిన పత్రాలు సమర్పించి, అనుమతులు పొందాలంటూ గతంలోనే అలీకి నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులపై అలీ స్పందించకపోడంతో తాజాగా రెండోసా రి నోటీసులు జారీ చేశారు. ఫామ్ హౌస్ నిర్మాణాలకు సంబంధించిన పత్రాలు సమర్పించి అనుమతులు పొందాలని కోరారు. లేని పక్షంలో పంచాయతీరాజ్ చట్టం ప్రకా రం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫామ్ హౌస్ లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఈ నెల 5న మ్నెదటిసారి నోటీసు ఇవ్వగా అలీ నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. దీంతో ఈనెల 22న మరోసారి నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఫామ్‌హౌస్‌లో పని చేస్తున్న వారికి నోటీసులు అందించామని పంచాయతీ సెక్రటరీ తెలిపారు. కొద్ది సంవత్సరాల క్రితం కమెడియన్ అలీ ఎక్ మామిడి గ్రామ పంచాయతీ పరిధిలో వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిని అలీ వ్యవసా యానికి వినియోగించేవారు. స్థానిక కూలీల సహాయంతో ఈ భూమిలో పంటలు, పండ్ల తోటలు వేశారు. అయితే తన ఫామ్ కు వెళ్లేటప్పుడు ఉండడానికి ఫామ్ హౌస్ నిర్మించుకోవాలని నిర్ణయించి నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికే ఫామ్‌హౌస్ నిర్మాణం పూర్తవ్వగా.. ఈ నిర్మాణాలు అక్రమంగా నిర్మించారని ఆరోపణలు వచ్చాయి. గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఫామ్ హౌస్ లో నిర్మాణాలు చేపట్టారని స్థానికులు ఆరోపించారు. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు తనిఖీలు చేపట్టారు. తమ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు తేలడంతో అధికారులు అలీకి నోటీసులు జారీ చేశారు. దీనిపై అలీ నుంచి ఎలాంటి వివరణ వస్తుందో చూడాలి. ఇటీవల వరకు ఏపీ రాజకీయాల్లో యాక్టివ్ గా ఉన్న అలీ... వైసీపీ ఘోర పరాభవంతో రాజకీయాలకు గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే.

# వికసిత్‌భారత్‌లో యువతే కీలకం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. రకరకాల ఆవిష్కరణలు చేస్తున్నారు. దీంతో డబ్బు సంపాదిస్తూ ఉపాధి మార్గాలను అభివృద్ధి చేసుకుంటు న్నారు. యువత తమ ప్రయ త్నాల ద్వారా స్థిరమైన జీవనశైలిని కూడా ప్రోత్సహిస్తున్నారు. ముంబైకి చెందిన ఇద్దరు కూతుళ్ల ఈ ప్రయత్నం నిజంగా స్ఫూర్తిదా యకం. అక్షర, ప్రకృతి అనే ఈ ఇద్దరు కూతుళ్లు క్లిప్పింగులతో ఫ్యాషన్ వస్తువులను తయారు చేస్తున్నారు." అని ఆయన వ్యాఖ్యానించారు.

**పిచ్చుకల సహకారం..**


పిచ్చుకల గురించి మోడీ మాటల్లో.. మన చుట్టూ ఉన్న జీవవైవిధ్యాన్ని కాపాడుకోవడంలో పిచ్చుకలు చాలా ముఖ్యమైన పాత్రను కలిగి ఉన్నాయి. నేడు నగరాల్లో పిచ్చుకల జీవనం చాలా కష్టంగా మారింది. పెరుగుతున్న పట్టణీకరణ వల్ల అవి మనకు దూరమవుతున్నాయి. పిచ్చుకలను చిత్రాలలో లేదా వీడియోలలో మాత్రమే చూసిన నేటి తరం పిల్లలు చాలా మంది ఉన్నారు. అలాంటి పిల్లల జీవితాల్లో ఈ సుందరమైన పక్షిని తిరిగి తీసుకు రావడానికి కొన్ని ప్రత్యేకమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**పిచ్చుకల సంఖ్యను పెంచేందుకు వినూత్న ప్రయత్నం..**

పిచ్చుకల సంఖ్యను పెంచేందుకు చెన్నైకి చెందిన కూడుగల్ ట్రస్ట్ తమ ప్రచారంలో పాఠశాల విద్యార్థులను చేర్చుకుంది. ఇన్స్టిట్యూట్ నుంచి పలువురు పాఠశాలలకు వెళ్లి రోజువారీ జీవితంలో పిచ్చుక ఎంత ముఖ్యమైనదో పిల్లలకు చెబుతున్నారు. ఈ సంస్థ పిల్లలకు పిచ్చుక గూడు తయారు చేసేందుకు శిక్షణ ఇస్తుంది. దీని కోసం, ఇన్స్టిట్యూట్ ప్రజలు చిన్న చెక్క ఇంటిని తయారు చేయడం పిల్లలకు నేర్పించారు. ఇందులో పిచ్చుకలు బస చేసి తినేందుకు ఏర్పాట్లు చేశారని ప్రధాని తెలిపారు.

**తన గయానా పర్యటన గురించి ప్రస్తావన..**

మన్ కీ బాత్‌లో తన గయానా పర్యటన గురించి కూడా ప్రస్తావించారు. భారత్‌కు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న గయానాలో కూడా 'మినీ ఇండియా' ఉందని మోడీ అన్నారు. సుమారు 180 సంవత్సరాల క్రితం, భారతదేశం నుంచి ప్రజలు వ్యవసాయ కూలీలుగా, ఇతర పనుల కోసం గయానాకు వెళ్లారని.. నేడు, గయానాలోని భారతీయ సంతతికి చెందిన ప్రజలు రాజకీయాలు, వ్యాపారం, విద్య, సంస్కృతి యొక్క ప్రతి రంగంలో నాయకత్వం వహిస్తున్నారన్నారు. గయానా ప్రెసిడెంట్, డాక్టర్ ఇర్ఫాన్ అలీ కూడా భారతీయ మూలానికి చెందినవాడే అని గర్వంగా తెలిపారు. గయానా మాదిరిగానే ప్రపంచంలోని డజన్ల కొద్దీ



దేశాల్లో లక్షలాది మంది భారతీయులు ఉన్నారని మోడీ అన్నారు. 200-300 సంవత్సరాల క్రితం దశాబ్దాల నుంచి వారి పూర్వీకులు వారి స్వంత కథలను కలిగి ఉన్నారని గుర్తుచేశారు.

# ప్రజలను కాపాడుకునేందుకు మరో సంకల్ప దీక్ష అవసరం

(మొదటిపేజీ తరువాయి)



మళ్లీ వచ్చాయని ఆరోపణలు చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన పలువురు పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పాలనలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు ఛిద్రమైన పరిస్థితి ఉండేదని విమర్శించారు. ఇప్పుడు కూడా ఆ పరిస్థితులే కనిపిస్తున్నాయని అన్నారు. ఆటోడ్రైవర్ల నుంచి భవన నిర్మాణ కార్మికుల వరకు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి నుంచి సంపన్న వర్గాల వరకు.. అన్ని వర్గాల ప్రజలు అణచివేత, భయాందోళనకు గురవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాపాడుకునేందుకు మరో సంకల్ప దీక్ష కూడా చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని కేటీఆర్ చెప్పుకొచ్చారు. కేసీఆర్ స్ఫూర్తితో నేడు మళ్లీ ఢిల్లీ పార్టీ మెడలు వంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని, స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని జయశంకర్ సార్ చెప్పేవారని గుర్తు చేశారు. తెలంగాణలో నవంబర్ 29న తమ పార్టీ దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ దీక్షతో తెలంగాణ ఉద్యమం మలుపు తిరిగిందని అన్నారు. 60 ఏండ్ల తెలంగాణ ఉద్యమ చరిత్రపై కేసీఆర్ దీక్ష చెరగని ముద్ర వేసిందని చెప్పారు. తెలంగాణలోని మొత్తం 33 జిల్లాల్లో దీక్షా దివస్‌ను నిర్వహిస్తామని కేటీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి ఈనెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు జరుగుతాయని తెలిపారు. అన్ని జిల్లాలకు సీనియర్ నాయకులను ఇన్‌చార్జిలుగా నియమించామని చెప్పారు. కేసీఆర్ దీక్షలో నిమ్స్ హాస్పిటల్ పాత్ర కూడా ఘనమైనదని.. ఆ రోజు నిమ్స్ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిందని అన్నారు. అందుకే నవంబర్ 29న నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేశామని చెప్పారు. డిసెంబర్ 9న మేడ్చల్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణతో దీక్షా దివస్ ముగిస్తామని తెలిపారు. తెలంగాణ తల్లికి ప్రణమిల్లుతూ ఉత్సవాలు నిర్వహిస్తామని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు అందరూ పాల్గొంటారని కేటీఆర్ తెలిపారు.



# రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

- కొనుగోలు చేసిన ధాన్యం వెనక్కి పంపడంతో మనస్తాపం
- తరుగు తీయొద్దన్నందుకు రైస్‌మిల్లర్‌నిర్వాకం
- సూర్యాపేట జిల్లా అన్నారం ఐకేపీ కేంద్రం వద్ద ఉద్రిక్తత

**సూర్యాపేట, నవంబర్24:** క్వింటాల్ కు ఏడున్నర కిలోల తరుగు కోతకు రైతు అంగీకరించలేదన్న కారణంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నాణ్యతగా లేదంటూ రైస్ మిల్లర్ తిప్పి పంపడాన్ని నిరసిస్తూ గిరిజన రైతు దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో చౌళ్లతండాకు చెందిన గిరిజన రైతు గుగులోతు కీమా 425 బస్తాల ధాన్యాన్ని విక్రయించాడు. కాంటా అయిన తర్వాత ధాన్యాన్ని మిల్లు యాజమాని పరిశీలించి నాణ్యత లేదని.. ఏడున్నర కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని మిల్లు యాజమాని చెప్పాడు. ఒక కేజీ తరుగుకు మాత్రమే ఒప్పుకుంటానని రైతు చెప్పడంతో అంగీకరించని రైస్ మిల్లు యజమాని ధాన్యాన్ని తిప్పిపంపాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రైతు గుగులోతు కీమా దంపతులు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద లారీ వద్ద రైతు భీమా దంపతులు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఒంటిపై పెట్రోలు పోసుకుంటున్న సమయంలో సెంటర్‌లోని తోటి రైతులు వారిని చూసి వారి చేతుల్లోని పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. ఒక క్వింటాకు ఏడున్నర కిలోల తరుగు కోత చేస్తానని మిల్లర్ అంటున్నాడని, అలాగైతే 425బస్తాలకు 13 క్వింటాళ్లు తరుగు పోతుందని తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతు దంపతులు వాపోయారు. కౌలు చేసి పంట పండిస్తే మిల్లర్లు తమను దోచుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారు స్థానిక తహసీల్దార్ దయానందంకు ఫిర్యాదు చేశారు. వెంటనే తహసీల్దార్ డీటీ కంట్లమయ్య, ఏఓ బాలకృష్ణ, ఏపీఎం రాంబాబు ఐకేపీ సెంటర్‌కు చేరుకున్నారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దఅష్టికి తీసుకెళ్లడంతో మిల్లు యాజమాన్యంతో మాట్లాడి నష్టపోకుండా తిరిగి మిల్లుకు దింపేందుకు పంపించారు. ఆ మిల్లుకు పంపిన ధాన్యానికి బస్తాకు కిలో చొప్పున కోత విధిస్తున్నట్లు చెబుతున్నారు.

## నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

**కేంద్ర మంత్రి అధ్యక్షతన అఖిలపక్షం సమావేశం**


**హైదరాబాద్, నవంబర్ 24 :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20వ తేదీ వరకు సమావేశాలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి ఇటీవలే పార్లమెంట్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశాల్లోని సెషన్లలో ప్రవేశపెట్టబోయే బిల్లులు, ఇతర అంశాలపై సమావేశంలో చర్చించారు. భారతీయ వాయుయన్ విధేయక్ బిల్లు, విపత్తు నిర్వహణ(సవరణ) బిల్లు, రైల్వేస్(సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాల(సవరణ) బాయిలర్స్ బిల్లు, పంజాబ్ కోర్టుల(సవరణ) బిల్లు, ఇండియన్ పోర్ట్స్ బిల్లు తదితర మొత్తం 16 బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల సమస్యలపై సమావేశాల్లో వాడీవేడి చర్చ జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పాడి కౌశిక్ రెడ్డికి పోలీసులు నోటీసులు

**అనుమతిలేకుండా ధర్నా చేశారని..**

**హుజూరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. దళిత బంధు రెండవ విడత డబ్బులు విడుదల చేయాలంటూ ఈ నెల 9వ తేదీన హుజూరాబాద్ లో కౌశిక్ రెడ్డి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అయితే ధర్నా, రాస్తారోకోకు ఎలాంటి అనుమతులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీసుకోకపోవడంతో నోటీసులు జారీ చేశారు. సెక్షన్ 35(3) బీఎన్ఎస్ యాక్టు ప్రకారం కౌశిక్ రెడ్డి, బీఅర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసి పోలీసులు ఇచ్చారు. కౌశిక్ రెడ్డిపై పోలీసు కేసు నమోదు కావడంతో పాటు నోటీసులు కూడా జారీ చేయడంతో ఆయనను అరెస్ట్ చేసే అవకాశాలున్నాయని తెలిసింది. అయితే ఇది రాజకీయ కక్ష వేధింపుల కేసులేనంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు.

## నేడు ఢిల్లీకి సీఎం



**హైదరాబాద్, నవంబర్24 :** సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టనున్నారు. సోమవారం దేశ రాజధానికి వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానంతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలపై చర్చించే అవకాశం ఉంది. ఈ ఉత్సవాలకు హాజరుకావాలని ఏఐసీసీ పెద్దలను రేవంత్ రెడ్డి కోరనున్నట్లు సమాచారం. సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు సభకు హాజరుకావాలని రాహుల్ గాంధీని కోరనున్నట్లు తెలుస్తోంది. అలాగే కార్పొరేషన్ పదవులు, మంత్రివర్గ విస్తరణపై కూడా కాంగ్రెస్ పెద్దలతో రేవంత్ రెడ్డి చర్చించనున్నట్లు సమాచారం. మహారాష్ట్ర ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి పాలన ఏ మాత్రం ఇంపాక్ట్ చేయలేకపోయింది. ముఖ్యంగా ఆయన ప్రచారం చేసిన స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించలేకపోయింది. దీంతో మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటమికి రేవంత్ రెడ్డినే కారణమని అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ఆసక్తికరంగా మారింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
25 నవంబర్
2024



# లగచర్ల ఘటనలో కీలక పరిణామం

- దాడి ఘటన నిందితులతో ఎన్‌హెచ్‌ఆర్సీ భేటీ
- సంగారెడ్డి జైలుకు జైల్లో రైతులను కలిసిన సభ్యులు
- ఘటనపై పూర్తిగా ఆరా తీసిన బృందం

**సంగారెడ్డి, నవంబర్24:** వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలువురు రైతుల్ని అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం వారు సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీరిని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం ఆదివారం కలిసింది. 8 మంది సభ్యులతో కూడిన బృందం జైలుకు చేరుకొని రైతులతో మాట్లాడారు. ఈ కేసులో ఏ2 నిందితుడు సురేష్ సహా 19 మంది నిందితులు సంగారెడ్డి జిల్లా జైలులో ఉండగా.. వారిని కలిశారు. శనివారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న 8 మంది సభ్యులతో కూడిన ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం.. ఆదివారం ఉదయం నేరుగా సంగారెడ్డి జైలుకు వెళ్లింది. అక్కడ ఖైదీలుగా ఉన్న రైతులను కలిసి.. లగచర్ల ఘటనలో ఏం జరిగిందో వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటును అక్కడి రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 11న భూసేకరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం వికారాబాద్ కలెక్టర్ సహా.. ఇతర అధికారులు గ్రామానికి చేరుకోగా వారిపై రైతులు దాడికి పాల్పడ్డారు. కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. కలెక్టర్ సహా.. ఇతర అధికారుల వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఘటనపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయగా.. వీడియోలో ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. మరుసటి రోజు రాత్రి తండాల్లోకి వెళ్లిన పోలీసులు రైతులను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం19 మంది రైతులను కోర్టులో హాజరు పరచగా.. వారికి రిమాండ్ విధించారు. ప్రస్తుతం సంగారెడ్డి జైలులో రైతులు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. అయితే రైతుల అరెస్టుల సమయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని పలువురు ఎన్‌హెచ్‌ఆర్సీకి ఆశ్రయించారు. కుట్రపూరితంగా అమాయకులను అరెస్టు చేశారని ఫిర్యాదు చేశారు. గిరిజనులు, ఆడవారి పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని.. అర్ధరాత్రి ఇండ్లలోకి చొరబడి తమ వారిని అరెస్టు చేశారని పలువురు బాధితులు వాపోయారు. దీంతో 8 మంది సభ్యులతో జాతీయ మానవ హక్కుల సంఘం ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఘటనపై పూర్తి విచారణ చేసి.. బాధితులకు న్యాయం చేసేందుకు ఎన్‌హెచ్‌ఆర్సీ రంగంలోకి దిగింది. కాగా, కుట్రపూరితంగా లగచర్లలో అధికారులపై దాడులకు పాల్పడ్డారని సీఎం రేవంత్ విమర్శించారు. ఈ ఘటనలో ప్రతిపక్షాల కుట్ర ఉందని అన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీలు పట్టడం లేదని.. అక్కడ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అయితే ఈ కేసులో ఏ1 నిందితుడిగా పేర్కొంటూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.



## సీఎం అబద్ధాలు చెపుతున్నారు!

- లగచర్ల ఘటనలో సీఎం బుకాయిస్తున్నారు
- ఇండస్ట్రియల్‌కారిడార్‌అని మాట మార్చారు
- రైతులను ఒప్పించి, భూసేకరణ చేయాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్, నవంబర్ 24 :** మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారని తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ ఇస్తున్న గ్యారెంటీల మోసాన్ని మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. మహారాష్ట్రలో ఓటమి తర్వాతనైనా కాంగ్రెస్ పార్టీ మోసాలు మానుకోవాలని అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. లగచర్ల ఘటనలో సీఎం రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారని హరీశ్ రావు చెప్పారు. లగచర్లలో ప్రజలు తిరగబడితే ఇండస్ట్రియల్ కారిడార్ అని మాటమార్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి లగచర్లకు వెళ్లి ప్రజలను ఒప్పించి భూసేకరణ చేయాలని ఆయన సవాలు విసిరారు. లగచర్లలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తామని అసత్యాలు చెబుతున్నారని హరీశ్ రావు అన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని హరీశ్ రావు విమర్శించారు. లగచర్లకు నేతలు ఎవరూ వెళ్లకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం 1800 మందికి దళిత బంధు నిధులను మంజూరు చేసిందని అన్నారు. ఆ మంజూరు చేసిన నిధులను కూడా వాడుకోకుండా కాంగ్రెస్ సర్కారు నిలిపివేసిందని తెలిపారు.



# తూకంలో తరుగు తీస్తే చర్యలు

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్, నవంబర్ 24 :** పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే రైతులను తూకంలో తరుగులు తీస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఆదివారం పెద్ద కొత్తపల్లి మండల పరిధిలోని సాతాపూర్, చంద్రకల్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో.. ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన వరి ధాన్యంకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్ కు రూ,2340,సన్నాలకు బోనస్ రూ,500లు చెల్లిస్తుందన్నారు. రైతులు పండించిన పంటను గ్రామాల్లో దళారీలకు అమ్మి మోసపోవద్దని మంత్రి జూపల్లి సూచించారు. ఈ నెల 27,28,29 తేదీల్లో కొల్లాపూర్ పట్టణంలో జరుగనున్న ఆర్ఐడీ,కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని పట్టణం సుందరీకరణ కోసం హైద్రాబాద్ నుంచి తెప్పించిన ఎంతో ఖరీదైన వివిధ రకాల పూల మొక్కలను నాటుటకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణలో సిద్దంగా ఉంచిన పూల మొక్కలను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ఉదయం పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం నుంచి మేయిన్ రోడ్డు డివైడర్ పొడవునా కాలినడకన ఎన్టీఆర్ చౌరస్తా వరకు మంత్రి జూపల్లి నడిచారు. గతంలో నాటిన అందహీనంగా ఉన్న మొక్కలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు మంత్రి సూచించారు. దీంతో కూలీలతో పాత మొక్కలను తొలగింపు పనులు జరుగుతున్నాయి.




# విశ్వశాంతి కోసం మోదీ ప్రయత్నం

- అభివృద్ధిని కొన్ని శక్తులు సహించడంలేదు
- అరాచకాలు సృష్టించేందుకు చూస్తున్నారు
- విశ్వగురువు కోసం అందరూ కలిసి పని చేయాలి
- లోక్‌మంథన్ ముగింపు వేడుకల్లో కిషన్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్24:** హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ శిల్పకళా వేదికలో ఆదివారం లోక్‌మంథన్-2024 కార్యక్రమం ముగింపు వేడుకలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగిన లోక్ మంథన్‌లో వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షేకావత్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో ఆధ్యాత్మికత పెరుగుతుండడం, అభివృ ద్ధి జరుగుతుండడంతో కొన్ని శక్తులు సహిం చలేక పోతున్నాయని అన్నారు. అరాచకాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని వెల్లడిం చారు. దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్న సమయంలో అంతర్జాతీయ వేదికలపై విశ్వ శాంతి కోసం మోడీ ప్రయత్నిస్తున్నారని తెలిపా రు. దేశాన్ని విశ్వగురువుగా చేయడం కోసం అందరం కలిసి ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

### భిన్నత్వంలో కూడా ఏకత్వం ఉంది : మోహన్ భాగవత్

ఏకత అనేది శాశ్వతం.. భిన్నత్వం లో కూడా ఏకత్వం ఉందని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ అన్నారు. వాళ్ల గ్రౌండ్ లోకి వెళ్లి ఆడడం కాదు.. మన గ్రౌండ్ లోకి ప్రపంచాన్ని తీసుకురావాలన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ పై నైతికత పై చర్చ జరుగుతుందని, మనిషి బుద్ధి, హృదయంపై దాన్ని ఉపయోగించుకునే విధానం ఉంటుందన్నారు. మంచి బుద్ధి, హృదయాన్ని ఇచ్చేది భారతీయ సంస్కృతి అని, మనం ఎవరికి శత్రువులం కాదు.. ఎవరు మనకు శత్రువులు కారన్నారు. సంతోషాన్ని బయట వెతుక్కుంటూ ఉన్నారని, మన పూర్వీకులు సంతోషం మనలో ఉందని వందల సంవత్సరాల క్రితమే చెప్పారు! అని ఆయన అన్నారు. రుషుల ఆలోచనలో ఇది సనాతన దేశం, మన పూర్వీకుల దగ్గర సంస్కారం ఉండేది, కాబట్టి వ్యవహారం ఉండేది! అని ఆయన వ్యాఖ్యానించారు.

# నా కోరిక తీర్చు

- నీ భర్తతో గొడవ పరిష్కరిస్తా..
- మహిళకు హయత్‌నగర్ ఎస్సై వేధింపులు

**హయత్‌నగర్, నవంబర్ 24 :** భర్త వేధింపులు భరించలేక ఫిర్యాదు చేసేందుకు పోలీసుల దగ్గరకు వెళ్తే ఓ ఎస్సై దుర్మార్గంగా ప్రవర్తించాడు. భర్తతో ఉన్న విభేదాలను పరిష్కరించాలంటే.. తన కోరిక తీర్చాలని బలవంతపెట్టాడు. ఎవరూ లేనప్పుడు చెబితే ఇంటికి వస్తానంటూ నిత్యం వాట్సాప్‌లో కాల్ చేసి ఆమెకు వేధింపులకు గురిచేశాడు. హైదరాబాద్‌లోని హయత్ నగర్ పీఎస్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ.. తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసేందుకు 40 రోజుల క్రితం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అయితే సదరు మహిళపై కన్నేసిన ఎస్సై సైదులు ఆమె ఫోన్ నంబర్ తీసుకున్నాడు. అప్పట్నుంచి ఆమెను కాల్ చేసి వేధించడం మొదలుపెట్టారు. నీ భర్తతో ఉన్న సమస్యను పరిష్కరిస్తా.. నా కోరిక తీర్చాలంటూ బలవంతపెట్టాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చెప్ప వస్తానంటూ వాట్సాప్ కాల్ చేస్తూ వేధింపులకు గురిచేశాడు. ఎస్సై వేధింపులపై సీపీకి ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో ఆ మహిళను ఎస్సై పోలీస్ స్టేషన్ పిలిపించి బెదిరింపులకు దిగాడు.

## ఢిల్లీ బాటలో హైదరాబాద్..

### పడిపోయిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ !

**హైదరాబాద్ :** నగరంలో పరిస్థితి చేయి దాటిపోతోందని వాతావరణ పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఢిల్లీ మెట్రో నగరంలో అమలు చేస్తోన్న సరి, బేసి సంఖ్యల విధానాలను ఇక్కడ పాటించక తప్పదన్న వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి. పెరిగిపోయిన కాలుష్యంతో ఢిల్లీలో ఇప్పటికే పాఠశాలలకు సెలవులు ప్రకటించగా కొన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులను, సాఫ్ట్‌వేర్ ప్రతినిధులను ఇంటి నుంచి పని చేయాలని ఢిల్లీ సర్కార్ ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా హైదరాబాద్ నగరంలో ఆదివారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఒక్కసారిగా పడిపోయిందని నిపుణులు చెబుతున్నారు. కూకట్‌పల్లి, మూసాపేట్, బాలానగర్, నాంపల్లి, మెహదీపట్నంలో గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిందని నివేదికలు పేర్కొన్నాయి.ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 300 దాటిందని, ఇది ప్రమాదకర సూచనను తెలియజేస్తోందని ఈ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తీవ్ర చలితో చిన్నారులు, వయోవృద్ధులు గడగడలాడుతుండగా తాజాగా కాలుష్యం పెరిగిపోవడంతో హైదరాబాద్‌లో నెలకొన్న వాతావరణం తీవ్ర ఇబ్బందులకు గురి చేసే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

## బకాయిలు పెట్టేసి.. ఇప్పుడు నీతులు చెబుతావా జగన్?

### మంత్రి నారా లోకేశ్ కౌంటర్



**అమరావతి :** చిన్న పిల్లల చిక్కీల్లో కూడా డబ్బులు మింగేసిన వైకాపా అధినేత జగన్ రెడ్డి సుద్ధపూసలా కబుర్లు చెప్పడం వింతగా ఉందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. అమరావతి: చిన్న పిల్లల చిక్కీల్లో కూడా డబ్బులు మింగేసిన వైకాపా అధినేత జగన్ రెడ్డి సుద్ధపూసలా కబుర్లు చెప్పడం వింతగా ఉందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందన్న జగన్ విమర్శలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 6,500 కోట్ల బోధనా ఫీజులబకాయిలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తీర్చిన విషయాన్ని ప్రస్తావించారు. విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో రూ. 3,500 కోట్లు బకాయిలు పెట్టడంతో సర్టిఫికెట్లు రాక లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే ఆ సమస్యను పరిష్కరించామన్నారు. గత ప్రభుత్వం చేతగానితనంతో ప్రభుత్వ పాఠశాలల నుంచి నాలుగు లక్షల మంది విద్యార్థులు వెళ్లిపోవడం వాస్తవం కాదా? అని నిలదీశారు. 'నాడు-నేడు' అంటూ పీక్ పబ్లిసిటీ చేసుకున్న జగన్ అండ్ కో పాఠశాలల్లో బల్లలు, తాగునీరు, టాయిలెట్లు వంటి కనీస సౌకర్యాలూ కల్పించలేదని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదు-పాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని లోకేశ్ తెలిపారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. సంస్కరణలతో మన విద్యా వ్యవస్థను దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

## ఆర్టీసీ బస్సులో ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



**రేణిగుంట:** ఆర్టీసీ బస్సులో ఉరేసుకుని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన తిరుపతి జిల్లాలో చోటుచేసుకుంది. బస్సు ఏర్పేడు సమీపంలోకి వచ్చినప్పుడు ఈ ఘటన జరిగినట్లు సమాచారం. రేణిగుంట వద్ద కండక్టర్ దీన్ని గుర్తించారు. బస్సులో చివరి సీటు వద్ద ఉన్న హ్యాంగర్‌కు ఉరేసుకుని చనిపోయినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో బస్సులో ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతిచెందిన యువకుడి వివరాలు తెలియాల్సి ఉంది.

# డిసెంబర్‌లో పెళ్లి ముహూర్తాలు



వివాహ వేడుక ప్రతి ఒక్కరి జీవితంలో ఓ మధురానుభూతి. అందుకే అందరూ మెచ్చుకునేలా, పదికాలాలు గుర్తుండి పోయేలా వైభవంగా జరుపుకోవాలని భావిస్తారు. అందుకు తగ్గట్లే ఏర్పాట్లు చేసుకుంటారు. బంధువులందరి సమక్షంలో ఆనందంగా పెళ్లి కార్యక్రమం జరుపుకుంటారు. దీంతో ఫంక్షన్ హాళ్లు, పురోహితులకు, మంగళ వాయిద్యాలు, ఫుడ్ క్యాటరింగ్, డెకరేషన్, ఫొటోగ్రాఫర్లకు, షామియానా , పూలదండలు, తదితర వ్యాపారులకు ఈ కొన్ని రోజులు చేతి నిండా పని దొరకనుంది. నవంబర్‌లో పెళ్లి సందడి నెలకొంది. మళ్లీ ముహూర్తాల సందడి మొదలైంది. ఈ క్రమంలో వచ్చే నెల డిసెంబర్‌లో కూడా పెళ్లిళ్లకు శుభ ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు తెలిపారు. దీంతో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా పెళ్లి బజాలు మోగనున్నాయి. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలతో ఊరువాడ కళకళలాడనున్నాయి. డిసెంబర్(మార్గశిర)లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈ నెలలో బలమైన ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు, సిద్ధాంతులు చెబుతున్నారు. డిసెంబర్ 4, 5, 6, 7, 10, 11, 14, 20, 22, 24, 25 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయని తెలిపారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో వివాహాలు జరుగుతాయి. ఇక జనవరిలో మంచి ముహూర్తాలు లేవు. జనవరి 31 నుంచి మార్చి 4 వరకు మాఘమాసంలో శుభకార్యాలకు ముహూర్తాలు ఉన్నాయి.

## పంట పొలాల్లోకి దూసుకెళ్లిన సూపర్ లగ్జరీ బస్సు

**తోట్లవల్లూరు:** కృష్ణా జిల్లా తోట్ల వల్లూరులో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. కృష్ణా నది ఎడమ కరకట్టపై నుంచి సూపర్ లగ్జరీ బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన ఐలూరు గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు ఐలూరు గ్రామ సమీపంలో రోడ్డుపై గుంతలు ఉండటంతో అదుపు తప్పింది. ఈ క్రమంలో కరకట్ట మీద నుంచి పెద్ద చెట్టును ఢీకొట్టి.. పంట పొలాల్లోకి దూసుకెళ్లి ఆగింది. ప్రమాద సమయంలో బస్సులో 37మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనతో వారంతా భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో అక్కడ పొలాల్లో పనిచేస్తున్న రైతులు, కూలీలు హుటాహుటిన బస్సు వద్దకు పరుగెత్తుకొని వచ్చారు. ప్రయాణికులకు స్వల్ప గాయాలు మినహా ఎవరికీ అపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పాక్షికంగా ధ్వంసమైంది. సమాచారం తెలుసుకున్న ఎస్సై అర్జునరాజు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. ప్రమాదం ఎలా జరిగిందో విచారించారు. ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి విజయవాడకు పంపించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
25 నవంబర్
2024








## గుట్ట దివ్య జీవన సంఘం అధ్యక్షులుగా

# బత్తిని కృష్ణ గౌడ్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్,: యాదగిరిగుట్ట దివ్య జీవన సంఘం మండల శాఖ అధ్యక్షులుగా దాతర్ పల్లి గ్రామానికి చెందిన బత్తిని కృష్ణగౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం బుచ్చిదాస్ ఆశ్రమంలో గుట్ట మండలం నుంచి విచ్చేసిన భక్త బృందాల సభ్యులతో సాధారణ మండల సమావేశం జరిగింది. దివ్య జీవన సంఘం విస్తరణ కోసం ఈ కమిటీని నియమిస్తున్నట్లు విశాఖపట్నం శివానంద ఆశ్రమం నిర్వాహకులు విష్ణు దేవానంద సరస్వతి స్వామి వారు చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన తోట సత్యం, కోశాధికారిగా చెడుదూపు సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా ఎడ్ల ఇంద్రారెడ్డి, కుసుమరాజు, కూరెళ్ల బాలాచారి, వెంగల్దాస్ రామచంద్రం, బూరుగు సంతోష్ రెడ్డి, రేగొండ పాండురంగం కూడా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బత్తిని కృష్ణ గౌడ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో దివ్య జీవన సంఘానికి మండల శాఖ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన విష్ణు దేవానంద సరస్వతి స్వామి వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమాజ వికాసం కోసం తాను పాటుపడతానని చెప్పారు. భక్తి మార్గంలోనే శాంతి, సుస్థిరత లభిస్తుందని బత్తిని కృష్ణ ఈ సందర్భంగా చెప్పారు. సమాజంలో మంచిని పెంపొందింప చేయడం కోసం తాను కృషి చేస్తానని చెప్పారు. తనతో పాటు తన కార్యవర్గ సభ్యులంతా సమాజ వికాసం కోసం పాటుపడుతామన్నారు.

## చౌటుప్పల్‌లో ఎదునోదు నరసింహచారి జయంతి వేడుకలు



చౌటుప్పల్, రోమింగ్ న్యూస్: సిద్ధాంత కళాసమ్రాట్ ఎదునోజు నరసింహాచార్య సిద్ధాంతి జయంతి వేడుకలు చౌటుప్పల పట్టణం చందన పాఠశాలలో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఎదునోజు నరసింహాచార్య జ్ఞాపకార్థం పంచాంగ సిద్ధాంతాలు డా.రథం మదనాచార్యులు, మునగాల యాదగిరి ఆచార్యులు ఇరువురికి 2024 వ సంవత్సరంకు పంచాంగ కేసరి పురస్కారం తో సన్మానించారు.ఈ కార్యక్రమానికి %ఖఅఎశీయబ% నాగ భూషణము సభాధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డా.ఎం.ఎన్ ఆచార్య వచ్చారు. ఆచార్య గారు ప్రసంగిస్తూ మానవ జీవితంలో జ్యోతిషం,వాస్తు,పంచాంగం ప్రభావం ఉందని,మానవ జీవితం లో సంఘటనలను ముందుగానే తెలుసుకొని కొన్నింటిని సరిదిద్దుకొని ముందుకు సాగవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు ఎదునోజు నరసింహాచారి గొప్ప సిద్ధాంతిగా తెలుగు సంస్కృత భాషలలో మంచి పాడిత్యం కలిగినవారని,సామాజిక సేవలో ముందుండే వారని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు అందచేయడం జరిగింది 11వ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు, విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాసు సమన్వకర్త కూరెళ్ళవెనరసింహాచారి,రాచకొండ వేణుకుమారాచార్యులు,నాగార్జున సత్యనారాయణ శర్మ,బడుగు శ్రీరాములు,పంతంగి మదనాచార్యులు,దాసోజు భిక్షమాచారి పాల్గొన్నారు.

## ఎన్నారై బీఆర్ఎస్ యూకే నూతన కార్యవర్గం

### యూకే నూతన ఉపాధ్యక్షుడిగా సతీష్ రెడ్డి గొట్టెముక్కుల



నకిరేకల్ నవంబర్ 24( రోమింగ్ న్యూస్) : ఎన్నారై బీఆర్ఎస్ యూకే నూతన కార్యవర్గాన్ని ఎన్నారై బీఆర్ఎస్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం సంయుక్తంగా ప్రకటించారు. అనిల్ కూర్మాచలం నేతృత్వంలో యూకే లో మొట్టమొదటిగా ఎన్నారై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి, గత 14 సంవత్సరాలుగా అటు తెలంగాణ ఉద్యమంలో ఇటూ బంగారు తెలంగాణ నిర్మాణంలోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తూ, నేడు ప్రతిపక్షపాత్రను కూడా సమర్థవంతంగా పోషిస్తుందని మహేష్ బిగాల తెలిపారు.ప్రస్తుత అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి గత 6 సంవత్సరాలుగా యూకేలో పార్టీకి ఎంతో సేవ చేసిన ఎన్నో కార్యక్రమాలు చేపట్టి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని మహేష్ బిగాల అభినందించారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపి, రానున్న రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపుకి స్పందించి కెసిఆర్ నాయకత్వాన్ని మరింత బలపరుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చెయ్యాలని మహేష్ బిగాల అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం నూతన కమిటీ సభ్యులని కోరారు. యూకే నూతన ఉపాధ్యక్షుడిగా నకిరేకల్ నియోజకవర్గంలోని కేతేపల్లి మండలానికి చెందిన సతీష్ రెడ్డి నియమితులైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన భారాస అధినేత కెసిఆర్ కి, కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీర్ కి, ఎన్నారై భారాస వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ కూర్మాచలం కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అలాగే వచ్చే ఎన్నికలనాటికి పార్టీ బలోపేతానికి కృషిచేస్తూ పార్టీ ని అధికారంలోకి తీసుకరావడానికి తనవంతు ప్రయత్నిస్తానని తెలిపారు.

# యాదగిరీశా... పాహిమాం పాహిమాం!!





## యాదాద్రిలో భక్తుల పరవశం

### శ్రీలక్ష్మీ నరసింహునికి రూ. 79, 70, 843

యాదగిరిగుట్ట రోమింగ్ న్యూస్: శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండపైకి విచ్చేసిన భక్తులతో యాదగిరిగుట్ట లో కోలాహలం నెలకొన్నది. కార్తీక మాసం ముగింపు దశకు వస్తుండడంతో యాదగిరిగుట్టకు వచ్చే భక్తుల సంఖ్య ఒక్కసారిగా భారీగా పెరిగిపోయింది. ఆదివారం వివిధ పూజలు దర్శనాల ద్వారా 70 లక్షల పై చిలుకు ఆదాయం రావడం విశేషం.

ఉదయం సుప్రభాతంతో మొదలైన పూజా కైంకర్యాలు రాత్రి జరిగిన శయనింపు సేవతో ముగిశాయి.

సత్యనారాయణ స్వామి వ్రత పూజలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి రథమండపాలు ధూప.. దీప నైవేద్యాలతో ప్రత్యేక వాతావరణం ని ఆవిష్కరింపజేస్తున్నాయి. ఎటు చూసినా లక్ష్మీనరసింహుని కొలుస్తూ తరిస్తున్న భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటున్నది. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి భాస్కర్ రావు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు.

శ్రీవారి నిత్య కళ్యాణం ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









శ్రీలక్ష్మీ నరసింహుని ఖజానాకు రూ: 79,70,843 ఆదాయం

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి ఆదివారం రూ: 79,70,843 సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి భాస్కర్ రావు తెలిపారు. శ్రీ స్వామి వారికి 2520మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

కళ్యాణ కట్ట 1,26,000/-
ప్రధాన బుకింగ్ 3,21,750/-
కైంకర్యములు4,401/-
సుప్రభాతం 25,900/-
బ్రేక్ దర్శనం 6,14,700/-
వ్రతాలు 13,18,400/-
వాహన పూజలు 19,900/-
%ఎఱూ% దర్శనం 14,11,950/-
ప్రచారశాఖ 88,750/-
పాతగుట్ట 68,210 /-
కొండపైకి వాహన ప్రవేశం 8,00,000/-
యాదఋషి నిలయం 3,25,817/-
సువర్ణ పుష్పార్చన 1,53,728/-
శివాలయం 20,500/-
శాశ్వత పూజలు 10,000/-
పుష్కరిణ 3,500 /-
ప్రసాదవిక్రయం 26,32,710/-
లాకర్స్ 300/-
అన్నదానం 24,327/-

# నంద్యాల పట్టణంలో మట్కా నియంత్రనే లక్షంగా తనిఖీలు....

శ్రీశైలం, నవంబర్ 24 ( రోమింగ్ న్యూస్ )

జిల్లాలో మట్కా నియంత్రణే లక్ష్యంగా ప్రతిరోజు విస్తృత తనిఖీలు..నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా మట్కా,జూదం మొదలగునవి నియంత్రించుటకు విశ్రుత తనిఖీలు నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా నంద్యాల 3 టౌన్ పోలీసు స్టేషన్ పరిదిలో నంద్యాల CCS పోలీసులు మరియు 3 టౌన్ పోలీసుల ఉమ్మడి తనిఖీలు నిర్వహించడం జరిగింది.



ఈ తనిఖిలలో క్రింద కనపరచిన ముద్దాయిలు మట్కా ఆడుటకు ప్రజలను ప్రేరేపించి వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేయు చేయుచుండగా రాబడిన సమాచారం మేరకు సదరు పోలీసు అదికారులైన CCS ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్,3 టౌన్ ఇన్స్పెక్టర్ సూర్య మౌళి మరియు వారి సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఇబ్రహీం, ఏసుదాసు ,రమణరాజు, కానిస్టేబుల్ మాలిక్, మద్దిలేటి ,వెంకటేశ్వర్లు ,శివన్న ,గాంధీ ,వేణు ల సహాయంతో అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 2,00,000/-రూపాయలను తదుపరిచర్య నిమిత్తం స్వాదినం చేసుకోవడమైనది.

1 పశువుల శ్రీనివాసులు, బైర్మల్ స్ట్రీట్, నంద్యాల టౌన్ 30,000 రూపాయలు. 2. నందిపాటి చిన్న రామయ్య ఏ ఖలీల్, చింతరుగు నంద్యాల టౌన్ 20,000 రూపాయలు

3.కోట శ్రీనివాసరెడ్డి, గాజులపల్లె గ్రామం, మహానంది మండలం 10,000 రూపాయలు 4. దూదేకుల అన్వర్ భాష, తిమ్మాపురం గ్రామం, మహానంది మండలం 40,000 రూపాయలు

5.పిచిక హనుమంతు, హరిజన పేట, నంద్యాల టౌన్ 20,000 రూపాయలు

6.దూదేకుల రహిమాన్, గణేష్ నగర్, కర్నూల్ టౌన్ 80,000 రూపాయలు.

స్వాదినం చేసుకున్న నగదు 2,00,000/- రూపాయలు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ ఎవరైన ప్రజలకు అధిక డబ్బులు వస్తాయని ఆశ చూపించి పేద ప్రజల జీవితాలను మట్కా అనే జూదం వైపు మరల్చి వారి జీవితాలను నాశనం చేయుటకు పాల్పడిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మరియు జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు ఇలాంటి కార్యక్రమాలపై దాడులు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
25 నవంబర్
2024





# ఐపీఎల్ తొలిరోజు వేలం

## రూ.27 కోట్లతో పంత్ రికార్డు
## లీగ్ చరిత్రలోనే అత్యధిక రేటు

**అనుకున్నదే జరిగింది. విధ్వంసకర బ్యాటర్ రిషభ్ పంత్ ధాటికి ఐపీఎల్ బాక్సులు బద్ధలయ్యాయి. ఢిల్లీ క్యాపిటల్స్ మెగా వేలానికి వదిలేసినప్పుడే అతడికి పలికే ధరపై అంతా ఊహించారు. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా పంత్ రేటు పైపైకి ఎగబాకుతూ ఏకంగా రూ.27 కోట్ల దగ్గర ఆగింది. అంతే.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డుపుటలకెక్కాడు. రైట్ టు మ్యాచ్ ద్వారా అతడిపై డీసీ కన్నేసినా.. లఖ్‌నవూ మాత్రం పట్టు వదల్లేదు. అంతకుముందు పంజాబ్ సైతం దూకుడుగా వెళ్లి శ్రేయాస్‌ను రూ.26.75 కోట్లకు దక్కించుకుంది. అయితే అంచనాలకు భిన్నంగా కేఎల్ రాహుల్ కేవలం రూ.14 కోట్లకే ఢిల్లీ సొంతమవడం గమనార్హం. ఇక వెంకటేశ్ అయ్యర్‌ను అతడి పాత జట్టు కేకేఆర్ రూ.23.75 కోట్ల భారీ మొత్తానికి చేజిక్కించుకోవడం ఆశ్చర్యపరిచింది.**

జెద్దా: ఐపీఎల్ వేలం ఎప్పుడు జరిగినా ఆయా ఫ్రాంచైజీలు ఎక్కువగా విదేశీ ఆటగాళ్లపై దృష్టి సారిస్తుంటాయి. కానీ ఈసారి మెగా వేలంలో మాత్రం భారత ఆటగాళ్లపై కనకవర్షం కురిపించాయి. ఆదివారం తొలిరోజు వేలంలో వీరు కనీవినీ ఎరుగని రేటు పలికారు. రిషభ్ పంత్‌ను లఖ్‌నవూ రూ.27 కోట్లతో, శ్రేయాస్ అయ్యర్‌ను ఢిల్లీ రూ.26.75 కోట్లతో కొనుగోలు చేశాయి. ఐపీఎల్ చరిత్రలో ఈ ఇద్దరివే టాప్-2 రికార్డు ధరలు కావడం విశేషం. దీంతో గతేదాది ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ (రూ.24.75 కోట్లు) అత్యధిక ధర బద్దలయ్యింది. ఈసారి స్టార్క్‌ను ఢిల్లీ రూ.11.75 కోట్లకే దక్కించుకోవడం గమనార్హం. తొలిరోజు మొత్తంగా 72 మంది ఆటగాళ్లు అమ్ముడవగా.. వీరికోసం ఫ్రాంచైజీలు రూ. 467.95 కోట్లు వెచ్చించాయి. సోమవారంతో వేలం ముగుస్తుంది.

### ఈ ఇద్దరి కోసం హోరాహోరీ

వేలంలో ఐదో ఆటగాడిగా రిషభ్ పంత్ పేరు చెప్పగానే ఆడిటోరియంలోని ప్రేక్షకులు చప్పట్లతో స్వాగతం పలికారు. అటు వేలం కూడా అత్యంత ఆసక్తికరంగా సాగింది. మొదట పంత్ కోసం లఖ్‌నవూతో పోటీపడిన ఆర్‌సీబీ రూ.12 కోట్ల దగ్గర వెనక్కి తగ్గింది. ఈ దశలో సన్‌రైజర్స్ ప్రవేశించి రేటును రూ.20 కోట్లు దాటించింది. చివరకు రూ.20.75 కోట్ల దగ్గర వెనక్కి తగ్గడంతో.. ఢిల్లీ తమ పాత కెప్టెన్ కోసం ఆర్‌టీఎం ఉపయోగించింది. కానీ లఖ్‌నవూ మాత్రం పట్టు వదలకుండా రేటును ఒకేసారి రూ.27 కోట్లకు పెంచడంతో డీసీ షాకయ్యింది. దీంతో ఐపీఎల్ రికార్డు ధరతో పంత్ లఖ్‌నవూ కెప్టెన్‌గా మారబోతున్నాడు. అయితే పంత్ ధర ఊహించిందే అయినా.. శ్రేయాస్ అయ్యర్ మాత్రం జాక్‌పాట్ దక్కించుకున్నట్టే. వేలంలో అతడి పేరు పంత్‌కన్నా ముందే రావడం కూడా కలిసివచ్చింది. ఈ ఇద్దరిలో ఒకరిని దక్కించుకోవాలని పంజాబ్ కింగ్స్ ముందే భావించినట్టుంది. అందుకే శ్రేయాస్ కోసం పట్టుదల చూపింది. మొదట కేకేఆర్ కూడా తమ పాత కెప్టెన్ కోసం ఆసక్తి చూపింది. ఆ తర్వాత డీసీ రేసులోకి రావడంతో తొలిసారి రూ.20 కోట్ల మార్క్‌ను దాటిన భారత ఆటగాడయ్యాడు. ఆ జట్టు కూడా కెప్టెన్ కోసం చూస్తుండడంతో రేటు వేగంగా పెరిగింది. చివరకు రూ.26.75 కోట్లతో పంజాబ్ ఖాతాలో చేరాడు.

### ప్చ్.. రాహుల్

గత సీజన్‌లో లఖ్‌నవూ కెప్టెన్‌గా ఉన్న కేఎల్ రాహుల్ వేలంలో సులువుగా రూ.20 కోట్ల మార్క్ దాటుతాడని భావించారు. కానీ ఫ్రాంచైజీలు అతడిపై పెద్దగా ఆసక్తి చూపలేదు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఫామ్ కోల్పోవడం ప్రభావం చూపిందేమో. ఆర్‌సీబీ, చెన్నై ఆరంభంలో బిడ్ వేసినా రూ.14 కోట్లకే ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుని సంబరపడింది. వచ్చే సీజన్‌లో అతడినే తమ కెప్టెన్‌గా ప్రకటించే అవకాశం ఉంది.







### వావ్.. వెంకటేశ్

గత సీజన్‌లో కోల్‌కతాకు ఆడిన ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌కు మాత్రం ఎవరూ ఊహించని ధర పలికింది. అతడిని రిటైన్ చేసుకోకుండా వేలానికి వదిలిన కోల్‌కతానే తిరిగి అతడిని ఎలాగైనా సొంతం చేసుకోవాలనే కసి చూపింది. అందుకే వేలంలో ఆర్‌సీబీతో దూకుడుగా పోటీ పడింది. చూస్తుండగానే రేటు రూ.20 కోట్ల మార్క్‌ను దాటేసింది. చివరకు కేకేఆర్ రూ.23.75 కోట్లతో అతడిపై కనకవర్షమే కురిపించింది.

### స్వదేశీ ఆటగాళ్లే ముద్దు

తొలిసారిగా ఐపీఎల్ వేలంలో భారత ఆటగాళ్లు మెరిశారు. ముఖ్యంగా పేసర్లపై ఆయా జట్లు ఎక్కువగా దృష్టి సారించాయి. ఈ వేలం మొదట పేసర్ అర్ష్‌దీప సింగ్‌తో ఆరంభం కాగా రూ.2 కోట్ల కనీస ధర ఉన్న అతడిని తీసుకునేందుకు సగంజట్లు పోటీపడ్డాయి. చివర్లో సన్‌రైజర్స్ ఎంట్రీతో రేటు రూ.15.75 దగ్గర ఆగింది. ఈ దశలో పంజాబ్ కింగ్స్ ఆర్‌టీఎం ఉపయోగించగా.. రైజర్స్ ధరను రూ.18 కోట్లకు పెంచింది. దీనికి కూడా పంజాబ్ అంగీకరించడంతో అర్ష్‌దీప్ తన పాత జట్టులోనే చేరాడు. ఇక స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌కు అధిక ధరే పలికింది. గుజరాత్, చెన్నైన, లఖ్‌నవూ, సన్‌రైజర్స్ అతడికోసం ప్రయత్నించాయి. చివరకు రూ.18 కోట్ల దగ్గర రైజర్స్ వైదొలగగా.. పంజాబ్ వశమయ్యాడు. అలాగే బెంగళూరుతో చాలాకాలం కొనసాగిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను గుజరాత్ టైటాన్స్ రూ.12.25 కోట్లకు తీసుకుంది. వెటరన్ పేసర్ మహ్మద్ షమి (రూ.10 కోట్లు), కీపర్ ఇషాన్ కిషన్ (రూ.11.25 కోట్లు) ఈసారి సన్‌రైజర్స్ తరఫున ఆడనున్నారు. బ్యాటర్ జితేశ్ శర్మ (రూ.11 కోట్లు) బెంగళూరు మారాడు. పేసర్లు నటరాజన్ (రూ.10.75 కోట్లు)ను ఢిల్లీ, అవేశ్ (రూ.9.75 కోట్లు)ను లఖ్‌నవూ, ప్రసిద్ధ్ (రూ.9.50 కోట్లు)ను టైటాన్స్ తీసుకోగా, స్పిన్నర్ ఆర్.అశ్విన్ (రూ.9.75 కోట్లు) తొమ్మిదేళ్ల తర్వాత తిరిగి 'సొంత' జట్టు చెన్నైకి ఆడబోతున్నాడు.

#### వేలంలో టాప్-5 ప్లేయర్లు

రిషభ్ పంత్ లఖ్‌నవూ రూ.27 కోట్లు
శ్రేయాస్ అయ్యర్ పంజాబ్ రూ.26.75 కోట్లు
వెంకటేశ్ అయ్యర్ కోల్‌కతా రూ.23.75 కోట్లు
అర్ష్‌దీప్ సింగ్ పంజాబ్ రూ.18 కోట్లు
యజ్వేంద్ర చాహల్ పంజాబ్ రూ.18 కోట్లు

### విదేశీ ఆటగాళ్లలో..

ఈసారి వేలంలో విదేశీ ఆటగాళ్లపై ఆయా ఫ్రాంచైజీలు జాగరూకతతో వ్యవహరించాయి. గుజరాత్ టైటాన్స్ జోస్ బట్లర్ (రూ.15.75 కోట్లు)పై పెట్టినదే అత్యధిక ధర కావడం గమనార్హం. ఆ తర్వాత పేసర్లు ట్రెంట్ బౌల్ట్ (ముంబై, రూ.12.50 కోట్లు), చివరి నిమిషంలో వేలంలోకి వచ్చిన జోఫ్రా ఆర్చర్ (రాజస్థాన్, రూ.12.50 కోట్లు), హాజెల్‌వుడ్ (ఆర్‌సీబీ, రూ.12.50 కోట్లు) నిలిచారు. ఫిల్ సాల్ట్ (ఆర్‌సీబీ, రూ.11.50 కోట్లు), స్టొయినిస్ (పంజాబ్, రూ.11 కోట్లు), రబాడ (టైటాన్స్, రూ.10.75 కోట్లు), నూర్ అహ్మద్ (సీఎస్‌కే, రూ.10 కోట్లు) మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరారు.

### రసిక్ పంట పండింది

అన్‌క్యాప్‌డ్ క్రికెటర్లలో రసిక్ దార్ సలామ్‌కు అత్యధిక ధర పలికింది. రూ.30 లక్షల కనీస ధర కలిగిన అతడిని బెంగళూరు రూ.6 కోట్లకు తీసుకుంది. అయితే రసిక్‌ను ఆర్‌సీబీ రూ.2 కోట్లకే తీసుకోగా, ఢిల్లీ జట్టు ఆర్‌టీఎంను ఉపయోగించింది. దీంతో ఆర్‌సీబీ ఒక్కసారిగా రేటును రూ.6 కోట్లకు పెంచి సొంతం చేసుకుంది. నమన్ ధీర్‌ను కూడా ముంబై ఇండియన్స్ ఆర్‌టీఎం ద్వారా రూ.5.25 కోట్లకు తీసుకుంది. అబ్దుల్ సమద్ (లఖ్‌నవూ), నేహల్ వధేరా (పంజాబ్) రూ.4.20 కోట్ల చొప్పున, అభినవ్ మనోహర్ (సన్‌రైజర్స్) రూ.3.20 కోట్లు, రఘువంశీ (కోల్‌కతా) రూ.3 కోట్లకు అమ్ముడయ్యారు. గత మినీ వేలంలో రూ.8.40 కోట్ల ధర పలికిన సమీర్ రిజ్వీని ఈసారి రూ.95 లక్షలకే ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుంది.

### వీరికి నిరాశే..

ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌పై ఎవరూ ఆసక్తి చూపలేదు. రూ.2 కోట్ల కనీసధర కలిగిన దేవ్‌దత్ పడిక్కళ్, బెయిర్‌స్టోకు సైతం నిరాశే ఎదురైంది. అలాగే అన్‌క్యాప్డ్ ప్లేయర్ యష్ ధుల్, అన్‌మోల్‌ప్రీత్, సీనియర్ పీయూష్ చావ్లా కూడా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలారు.

---

# ఇక.. మన చేతుల్లోనే



**విజయానికి ఏడు వికెట్ల దూరంలో భారత్**
**టీమిండియా రెండో ఇన్నింగ్స్ 487/6 డిక్లేర్డ్**
**కోహ్లీ, జైస్వాల్ శతక మోత**
**ఆసీస్ లక్ష్యం 534, ప్రస్తుతం 12/3**

**ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత్.. పెర్త్ టెస్ట్‌లో పూర్తిగా పట్టుబిగించింది. కోహ్లీ, జైస్వాల్ సెంచరీతో చెలరేగడంతో.. ఆసీస్ ముందు భారత్ 534 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం బుమ్రా బుల్లెట్ బంతులకు ఆసీస్ 12/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. మొత్తంగా విజయానికి 522 రన్స్ దూరంలో ఉన్న ఆస్ట్రేలియా.. పగుళ్లు కనిపిస్తున్న వికెట్‌పై ఏదో అద్భుతం చేస్తే తప్ప ఓటమిని తప్పించుకోలేని పరిస్థితి!**

పెర్త్: బ్యాటర్లు భళా అనిపించగా.. బుమ్రా మరోసారి బంతితో చెలరేగడంతో ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో భారత్ విజయం దిశగా దూసుకెళ్తోంది. సుదీర్ఘ కాలం తర్వాత స్టార్ బ్యాటర్ కోహ్లీ (100 నాటౌట్), యువ కెరటం యశస్వి జైస్వాల్ (161) శతకాలతో కదం తొక్కడంతో.. మూడో రోజు ఆటలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా ప్రత్యర్థి ముందు 534 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఓవర్‌నైట్ స్కోరు 172/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 487/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. రాహుల్ (77), నితీశ్ (38 నాటౌట్) విలువైన సహకారం అందించారు. నాథన్ లియోన్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన ఆసీస్ ఆదివారం ఆట ఆఖరుకు 12/3తో కష్టాల్లో పడింది. ఖవాజా (3 బ్యాటింగ్) క్రీజులో ఉండగా.. చివరి ఓవర్‌లో లబుషేన్ (3)ను కెప్టెన్ బుమ్రా (2/1) ఎల్బీ చేశాడు. మరో రెండు రోజుల ఆట మిగిలున్న నేపథ్యంలో లక్ష్యానికి కంగారూలు ఇంకా 522 పరుగుల దూరంలో ఉండగా.. చేతిలో 7 వికెట్లున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150, ఆసీస్ 104 రన్స్‌కు ఆలౌటయ్యాయి.

#### ధాటిగా ఆడుతూ..:

ముందురోజు సంయమనం పాటించిన ఓవర్‌నైట్ బ్యాటర్లు జైస్వాల్, రాహుల్.. తొలి సెషన్ నుంచే దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్టార్క్ బౌలింగ్‌లో వీరిద్దరూ చెరో బౌండ్రీతో ఉద్దేశాన్ని చాటారు. కాగా, హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో సిక్స్‌తో జైస్వాల్ సెంచరీ సాధించి సంబరాలు చేసుకొన్నాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లో రాహుల్‌ను స్టార్క్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 201 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన దేవ్‌దత్ పడిక్కళ్ (25) కూడా సెటిల్డ్ బ్యాటర్ జైస్వాల్‌కు చక్కని సహకారం అందిస్తూ స్కోరు బోర్డును నడిపించే ప్రయత్నం చేశాడు. దీంతో లంచ్ సమయానికి భారత్ 275/1తో నిలిచింది.

#### వావ్.. విరాట్..:

తిరిగి వచ్చిన తర్వాత రెండో సెషన్ తొలి బంతికే పడిక్కళ్‌ను అవుట్ చేసిన హాజెల్‌వుడ్.. రెండో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కోహ్లీ ఆరంభంలో ఆచితూచి ఆడినా ఆ తర్వాత జోరు పెంచాడు. అనూహ్యంగా బౌన్స్ అవుతున్న బంతులను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును దౌడు తీయించాడు. మరోవైపు 150 పరుగులు పూర్తి చేసుకొన్న జైస్వాల్ భారీ షాట్ ఆడే క్రమంలో మార్ష్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (1), ధ్రువ్ జురెల్ (1) వరుస ఓవర్లలో అవుటయ్యారు. అప్పటికే జట్టు పటిష్ఠ స్థితిలో అటాకింగ్ ఆటను ప్రదర్శించిన కోహ్లీ.. వాషింగ్టన్ సుందర్ (29)తో కలసి ఆరో వికెట్‌కు 89 రన్స్ జోడించాడు. స్టార్క్ బౌలింగ్‌లో సిక్స్‌తో గేర్ మార్చిన విరాట్.. వీలుచిక్కినప్పుడల్లా బౌండ్రీలు బాదడంతో టీ సెషన్‌కు టీమిండియా 359/5 స్కోరు చేసింది. ఇక, ఆఖరి సెషన్‌లో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న కోహ్లీ.. వీలైనంత వేగంగా సెంచరీ మార్క్ చేరేందుకు ప్రయత్నించాడు. సుందర్‌ను లియోన్ బౌల్డ్ చేసినా.. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నితీశ్ ఎడాపెడా షాట్లతో కంగారూ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. విరాట్‌తో కలసి ఏడో వికెట్‌కు అజేయంగా 77 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. మార్ష్ బౌలింగ్‌లో సిక్స్‌తోపాటు హ్యాట్రిక్ ఫోర్లతో నితీశ్ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఇక క్రమంగా 90ల్లోకి అడుగుపెట్టిన కోహ్లీ.. బౌండ్రీతో శతకం పూర్తి చేయడంతో టీమిండియా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

#### దెబ్బకొట్టిన బుమ్రా..:

కొండంత లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆసీస్ బుమ్రా దెబ్బకు కంగారు పడింది. తొలి ఓవర్‌లోనే మెక్‌స్వీనీ (0)ని డకౌట్ చేసిన బుమ్రా జట్టుకు అద్భుత ఆరంభాన్నిచ్చాడు. నైట్ వాచ్‌మన్ కమిన్స్ (2)ను సిరాజ్ వెనక్కిపంపాడు. ఇక, ఫామ్ కోసం తంటాలు పడుతున్న లబుషేన్‌ను బుమ్రా వికెట్లు ముందు దొరకబుచ్చుకున్నాడు. రివ్యూకు వెళ్లినా ఫలితం దక్కలేదు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 104.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) మార్ష్ 161, రాహుల్ (సి) క్యారీ (బి) స్టార్క్ 77, పడిక్కళ్ (సి) స్మిత్ (బి) హాజెల్‌వుడ్ 25, కోహ్లీ (నాటౌట్) 100, పంత్ (స్టంప్) క్యారీ (బి) లియోన్ 1, జురెల్ (ఎల్బీ) కమిన్స్ 1, సుందర్ (బి) లియోన్ 29, నితీశ్ (నాటౌట్) 38బీ ఎక్స్‌ట్రాలు: 55బీ మొత్తం: 134.3 ఓవర్లలో 487/6 డిక్లేర్డ్‌బీ వికెట్ల పతనం: 1-201, 2-275, 3-313, 4-320, 5-321, 6-410బీ బౌలింగ్: స్టార్క్ 26-2-111-1, హాజెల్‌వుడ్ 21-9-28-1, కమిన్స్ 25-5-86-1, మార్ష్ 12-0-65-1, లియోన్ 39-5-96-2, లబుషేన్ 6.3-0-38-0, హెడ్ 5-0-26-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనీ (ఎల్బీ) బుమ్రా 0, ఖవాజా (బ్యాటింగ్) 3, కమిన్స్ (సి) కోహ్లీ (బి) సిరాజ్ 2, లబుషేన్ (ఎల్బీ) బుమ్రా 3బీ ఎక్స్‌ట్రాలు: 4బీ మొత్తం: 4.2 ఓవర్లలో 12/3బీ వికెట్ల పతనం: 1-0, 2-9, 3-12బీ బౌలింగ్: బుమ్రా 2.2-1-1-2, సిరాజ్ 2-0-7-1.


1

కంగారూ గడ్డపై తొలి వికెట్‌కు అత్యధికంగా 201 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన భారత జోడీగా జైస్వాల్-రాహుల్. 1986లో సిడ్నీ టెస్ట్‌లో గవాస్కర్-శ్రీకాంత్ (191రన్స్) రికార్డు బద్దలైంది.

3

ఆస్ట్రేలియాలో ఆడిన తొలి టెస్ట్‌లోనే సెంచరీ నమోదు చేసిన మూడో భారత బ్యాటర్‌గా జైస్వాల్. జయసింహా, గవాస్కర్ ఈ ఘనతను అందుకొన్నారు.

4



ఓ క్యాలెండర్ ఇయర్‌లో మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు 150ం స్కోర్లు సాధించిన నాలుగో భారత బ్యాటర్‌గా జైస్వాల్. సచిన్ టెండూల్కర్, సెహ్వాగ్, కోహ్లీ గతంలో ఈఫీట్ నమోదు చేశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News




## నేనంటే తనకు అస్సలు పడదు



అందం, అభినయ సామర్థ్యం రెండూ దండిగా ఉన్న కథానాయిక అషికా రంగనాథ్. కలిసొచ్చే అదృష్టం కోసం కళ్లలో దీపాలు పెట్టుకొని మరీ ఎదురు చూస్తున్నది ఈ కన్నడ కస్తూరి. సిద్ధార్థ్‌కి జోడీగా ఈ అందాలభామ నటించిన 'మిస్ యు' సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో సామ్యూల్ నిర్మించిన ఈ చిత్రంపై అషికా ఎంతో ఆశ పెట్టుకున్నది. ఇటీవల ఈ సినిమా గురించి తను మాట్లాడుతూ 'ఇందులో నా పేరు సుబ్బులక్ష్మి. సిద్ధార్థ్ పేరు వాసుదేవ్. నేనంటే తనకు అస్సలు పడదు. కానీ.. అనుకోకుండా నా ప్రేమలో పడిపోతాడు. కారణం ఏంటో తెరపైనే చూడాలి.' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్. ఇంకా మాట్లాడుతూ 'నేను ఎలాంటి పాత్రలనైతే ఇష్టపడతానో.. అలాంటి పాత్ర సుబ్బులక్ష్మి. తను ఇన్నోసెంట్. పక్కా ట్రెడిషనల్. ఓ విధంగా ఇది సుబ్బులక్ష్మి కథే. ఇంతటి మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు రాజశేఖర్‌కీ, హీరో సిద్ధార్థ్‌కీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని తెలిపింది అషికా.

## నా మాజీ కోసం ఖరీదైన గిఫ్ట్‌లు కొన్నా : సమంత

'సిటడెల్ హనీ బన్నీ' ప్రమోషన్స్‌లో భాగంగా వరుణ్ ధావన్‌తో కలిసి సరదా చిట్‌చాట్‌లో పాల్గొన్నారు సమంత. 'స్పైసీ రాపిడ్ ఫైర్'లో ఎదుటి వ్యక్తి అడిగిన ప్రశ్నకు ఇష్టమైతే సమాధానం చెప్పొచ్చు. లేదంటే పచ్చిమిర్చి తినాల్సి ఉంటుంది. "అవసరం లేకపోయినా మీరు అత్యధిక మొత్తంలో దేని కోసం ఖర్చుపెట్టారు?" అని వరుణ్ ధావన్ ప్రశ్నించగా.. "నా మాజీకి ఇచ్చిన ఖరీదైన కానుకులు" అని బదులిచ్చారు సమంత. "ఎంత ధర ఉంటుంది?" అని అడగ్గా.. "కాస్త ఎక్కువే.. ఇక కొనసాగిద్దాం" అంటూ ముగించారు. అయితే.. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఆమె ఎవరి గురించి ఇలా మాట్లాడారు..? అని చర్చించుకుంటున్నారు. ఇక ఈ రాపిడ్ ఫైర్‌లో "ఇక్కడికి రావడానికి ముందు మీరు ఎవరికి మెసేజ్ చేశారు? ఆ సందేశాన్ని పైకి చదివి వినిపిస్తారా ?" అని వరుణ్ ప్రశ్నించగా.. బదులు చెప్పడానికి ఇష్టపడని సామ్ పచ్చిమిర్చి తిన్నారు. "హనీ బన్నీ షూట్ సమయంలో నా గురించి ఎవరితోనైనా గాసిప్స్ చెప్పావా?" అని అడగ్గా.. "లేదు. ఏదైనా అంటే నీతో డైరెక్ట్‌గా చెప్పేదాన్ని" అని చెప్పారు. ఇదే ప్రశ్నకు వరుణ్ స్పందిస్తూ.. "నేను, రాజ్ అండ్ డీకే.. నీ గురించి ఎక్కువగా గాసిప్స్ మాట్లాడుకునేవాళ్లం" అని నవ్వులు పూయించారు.



## జ్యోతి పాప హై గ్లామర్ డోస్.. స్టన్నింగ్!

గుప్పెడంత మనసు సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకి పరిచయం అయిన కన్నడ నటి జ్యోతి పూర్వజ్. జ్యోతి రాయ్ పేరుతో నటిగా అరంగేట్రం చేసిన ఈ బ్యూటీ సీరియల్ లో హీరో తల్లి పాత్రలో నటించింది. తరువాత ఈ సీరియల్ లో తన పాత్ర కంప్లీట్ అయ్యాక పూర్తిస్థాయిలో గ్లామర్ వైపు ఫోకస్ చేసింది. యంగ్ డైరెక్టర్ సుకు పూర్వజ్ ని వివాహం చేసుకున్న జ్యోతి రాయ్ తన పేరుని కూడా మార్చుకుంది.

ప్రస్తుతం సుకు పూర్వజ్ దర్శకత్వంలోనే 'ఏ మాస్టర్ పీస్' అనే సూపర్ హీరో చిత్రంలో జ్యోతి పూర్వజ్ నటించింది. ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే భర్త సుకు దర్శకత్వంలో రీసెంట్ గా 'కిల్లర్' అనే సినిమాకి ఆమె సైన్ చేసింది. దాంతో పాటు మరో సినిమా కూడా ఆమె చేతిలో ఉంది. ఇలా మూడు, నాలుగు సినిమాలకి జ్యోతి పూర్వజ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇవన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి.

ఇదిలా ఉంటే జ్యోతి పూర్వజ్ ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో జ్యోతి షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతాయి. రెగ్యులర్ గా జిమ్ లో వర్క్ అవుట్ లు చేస్తూ పర్ఫెక్ట్ లుక్ తో తన అందాన్ని జ్యోతి పూర్వజ్ మార్చుకుంటుంది. ఆమె అందం, ఆకర్షణతో ఇట్టే ఆకట్టుకుంటుంది. ఈ కారణంగానే జ్యోతి పూర్వజ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంటుంది.

ఇక ఈ అమ్మడు ఫోటోలు కొన్ని ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. మంత్రముగ్ధులని చేసే అందంతో ప్రకాశవంతంగా మెరిసిపోతుంది. ప్రతి హృదయాన్ని ఆమె గ్లామర్ ఇట్టే ఆకర్షిస్తుంది. స్వచ్ఛమైన గ్లామర్ కి చిరునామాగా జ్యోతి పూర్వజ్ ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. రోజు రోజుకి ఆమె అందంలో స్టార్ హీరోయిన్స్ కి పోటీ ఇస్తుందని ఫ్యాన్స్ అంటున్నారు. సరైన బ్రేక్ దొరికితే టాలీవుడ్ లో లేడీ సూపర్ స్టార్ గా మారే సత్తా జ్యోతి పూర్వజ్ కి ఉందని కామెంట్స్ చేస్తున్నారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986